## చిన్న కథ

# ఆడ బ్రతుకు

కె. సుబ్రహ్మణ్యం

> పెరికోరి చేసుకున్నా తిట్టి కొట్టి హింసించాడు భర్త. అంతేకాదు. త్రాగుడు నేర్చుకున్నాడు. సుఖంగా గడపవలసిన జీవితం చేజేతులా బాధామయమైనదిగా చేసుకున్నాడు. సహజంగానే ఆమె ఆశలన్నీ ఏకైక కుమారునిపై కేంద్రీకృతమైనవి. ఆ ముసలాడు కొడుకు జీవితం కూడా నాశనం చేస్తాడేమోనని ఆమె భయం. ఆడ బ్రతుకే అంత!

ప్రక్క గదిలో నుంచి ఖంగున దగ్గు, మూలుగులు వినపడ్డయ్.

"ముసిలాడు దగ్గుతున్నాడు లేవే" అంది అయిదేళ్ళ మనవరాలు పక్కింటి నేస్తంతో.

ఉయ్యాల్లోని తమ్ముడు కెవ్వుమన్నాడు. వంట ఇంటిలో నుంచి అమ్మ కేక వినిపించింది. నేస్తాన్ని విడిచిపెట్టి లోనికి పరుగెత్తింది పాప.

"పాపా! తాతయ్యను 'ముసిలాడు' అనొద్దని ఎన్నిసార్లు చెప్పాను నీకూ? తప్పుగాదూ?" అని పాపను మందలించింది అమ్మ. చంటివాణ్ణి ఒళ్ళోకి లాక్కుంటూ.

పాప సిగ్గుతో తల దించేసి, ఒక క్షణం ఆగి మళ్ళా సావిట్లోకి పరుగెత్తుకొచ్చింది. ఏదీ నేస్తం? అమ్మ వేసిన కేకలకు ఆ పిల్ల బెదరిపోయి ఎప్పుడో పారిపోయింది.

సంచీలో కూరలు పట్టుకొస్తూ, ఒగురుస్తూ గుమ్మం మెట్లు ఎక్కుతూన్న సోమమ్మను గట్టిగా వాటేసుకుంది ఆప్యాయంతో అల్లరి పాప.

"ఉండవే చిట్టితల్లీ! మెట్లెక్కనీ ముందు" నాయనమ్మ చిరుకోపంతో అంది. మనవరాలు సోమమ్మ కాళ్ళను ఇంకా గట్టిగా అదుముకుంటూ "నా మిఠాయి పొట్లం ఏదీ?" అంది.

"ఇస్తానమ్మా! ముందు ఇంట్లోకి రానియ్యి"

పక్క గదిలోనుంచి బొంగురుగా పిలిచాడు భర్త వీరన్న.

"ఈ ముసిలాడు ఇంకా నిద్దర పోలేదూ? ఇందాకే గురకలు తీశాడే!"

"నిన్ను పిలుస్తున్నాడు ముసిలాడు"— చూపుడువేలు గదివంకపెట్టి చూపింది పాప.

ఇంతలో కోడలు వంటగదిలో నుంచి వసారాలోకొచ్చి చూసింది. అత్తగారి చేతిలోని సంచీ తీసుకొని పక్కన పెడుతూ —"ఏమే, కుర్రదానా! నీకు ఎన్నిసార్లు చెప్పాలి, తాతయ్యను అలా అనొద్దు అని" అంటూ కసురుకొంది.

భయంతో నాయనమ్మ చాటుగా ఒదిగి నిలుచున్నది పాప, అమ్మ కొడుతుందేమోనని. సోమమ్మ విరగబడి నవ్వుతూ—

"మనవరాలు అనొచ్చు లేవమ్మా, కోడలా! ఇంకా చిన్నపిల్ల దాన్నేమీ అనబోకు" అంది.

పాపకు ధైర్యమొచ్చింది. నాయనమ్మ పంచనే నిలుచుంటూ, అమ్మవంక చూసి అడిగింది—

"మరే, అమ్మా! నాయనమ్మ కూడా తాతయ్యను 'ముసిలాడా' అని పిలుస్తుందేమే!"

"ఛా—నోర్ముయ్యి."

తాతయ్య మూలుగు పిలుస్తున్న ధోరణిలో వినిపించిందీసారి.

"వస్తున్నా —వస్తున్నా." సోమమ్మ గదిలో కెళ్ళింది.

పక్క గది చిన్నది. ఒక నులకమంచం, దానికి ఎదురుగా వీధివైపు ఒక చిన్న కిటికీ. పక్కనే అలమారులో మందు సీసాలతో నిండిపోయిన ఒక చిన్న బల్లతప్ప ఏమీ లేవు. మంచానికి ఎదురుగా వీధివైపు ఒక చిన్న కిటికీ.

"ఏమిటయ్యా నీ గోల. ఇంట్లో ఏమీలు తెమలంనీ మొదలెట్టావు మళ్ళీ?"

అస్పష్టంగా గొణిగి, జొల జొల కన్నీరు కార్చాడు వీరన్న. అయినా సోమమ్మ చలించలేదు. పక్షవాతం వచ్చినప్పటినుంచి వీరన్న పసివాడిలా అయిపోయాడు. ఎవరేనా కోప్పడితే భోరున ఏడుస్తాడు. తిండి తింటూ, తినలేదని బుకాయించేస్తాడు. ఈ తత్వానికి సోమమ్మ అలవాటు పడిపోయింది.

తల కష్టంగా పైకెత్తి కూచుని, "మిఠాయి" అని అడిగాడు ప్రాధేయపడుతున్నట్టు ముసలయ్య.

"ఓరి నీ ఇళ్ళు బంగారంగానూ!" అని ముక్కుమీద వేలేసుకుంది సోమమ్మ.

"అమ్మోయ్! తాతయ్యక్కూడా మిఠాయి కావాలంటా!" సోమమ్మతో కూడా తాతయ్య గదిలో కొచ్చి, చిన్న పాప అమ్మను గట్టిగా పిలుస్తూ, పరుగెత్తింది.

"ఇదేం చోద్యమమ్మా! ఈ ముసిలాడు మిఠాయి సంగతి ఎనిపట్టాడే' అని వీరన్నకు వినిపించేలాగా అనేసి, వీరన్న చెవి మృదువుగా మెలిపెడుతూ మందలించింది సోమమ్మ—"ఏమయ్యోయ్! ఈ బుద్ధి ఎప్పుడు పుట్టిందీ? పసిపిల్లలకోసం తెచ్చిన మిఠాయి నీకు పెడితే వాళ్ళేమవాలి?"

వీరన్న ఖంగున దగ్గి, ఆయాసంతో పక్క మీద వాలుకొని—

"కాఫీ!" అని తన కోరిక వెల్లడించాడు.

"కాఫీ, కాఫీ అంటూ పొద్దుణ్ణించి పెడుతులేడుతావ్, నీకు రాకపోయినా వాకన్నా రాదాయె (చావు)" అని విసుక్కుంది సోమమ్మ.

అప్పుడే గదిలోకొచ్చిన పాప తాతయ్య వంక కొంటెగా చూసి నవ్వుతూ—

"నాయనమ్మా! నువ్వు మరీ బజారు వెళ్ళినప్పుడు అమ్మ తాతయ్యకు కాఫీ కాచి ఇచ్చింది. కాదా తాతయ్యా!" అంది.

వీరన్న మనవరాలిని ఉరిమి ఉరిమి చూసి, సోమమ్మ వైపు చూడలేక తల దించుకున్నాడు.

"అదా, సంగతి! ఏమయ్యా! నీ కోడలు రెండోసారి కాఫీ పోసిందట. మళ్ళీ ఏం బాధ వచ్చింది నీకు?"

"ఇవ్వలేదే" అంటూ కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు వీరన్న.

"ఇంత ముసలాడివైనా ఆబద్ధాలు మానలేదు. 'కృష్ణా', 'రామా' అన్న చింతన అసలే లేదు. ఇంతేనమ్మా ఈ బ్రతుక్కి! ఈ ముసలి పీనుగు పెట్టే బాధలు ఆ పరమాత్మకే ఎరుక" అంటూ నెత్తి బాదుకుంటూ, మూడో కప్పు కాఫీ తేవటానికి వంటింట్లోకి వెళ్ళింది సోమమ్మ. ముసలయ్య కృశించిన ముఖంలో మందహాసం తళుక్కున మెరిసి మాయమైంది.

వీరన్న కిప్పుడు డెబ్బయి ఏళ్ళు. రెండేళ్ళ క్రితం పక్షవాతంవల్ల కాళ్ళూ, ఒకచెయ్యీ పడిపోయిమంచమెక్కిన వీరయ్య బాగా నీరసించిపోయాడు. కంటిచూపు తగ్గినా, మాంసాహారానికి పటుకు మిగిలిన పళ్ళు బాగానే పనికొస్తున్నయ్.

ఏభై సంవత్సరాల మాట. . .

ఫ్యాక్టరీలో మెకానిక్కుగా పనిచేసేవాడు వీరన్న. మనిషి ఒడ్డూ, పొడుగూ — ఆక్కలాంటి దేహం చూసి ఫ్యాక్టరీలోని పనివాళ్ళు జడుసుకునేవారు. వీరన్న నడుస్తూ వుంటే ఎదిరించిన ఆంబోతును మరపించేవాడు. వీరన్నకు ముప్పయి ఏళ్ళ వయస్సు. ఫ్యాక్టరీలోనే పని చేస్తున్న అంజయ్య కూతురు సోమమ్మ లావణ్యం చూసి పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. సోమమ్మ అప్పుడు పదిహేనేళ్ళ పిల్ల వయసు. ప్రతిదినం మధ్యాహ్నం ఫ్యాక్టరీ కూత వినిపించగానే అమ్మకోసం ఫ్యాక్టరీకి టిఫిన్ కారియర్‌లో అన్నం ఎట్టుకొచ్చేది. తండ్రీ కూతుళ్ళు పార్కులో అన్నాలు తిన్నాక, కారియర్ కడిగి ఇంటి కొచ్చేది సోమమ్మ. సోమమ్మ




ఎగర బోత

చిత్రం—డి. నాగవర్ధనరావు (గుంటూరు)

మీద కన్నేసిన వాళ్ళు చాలామంది. అయినా పోటీ పడి, సోమమ్మ హృదయంలో స్థానం పొంది ఆమెను పెళ్ళాడినవాడు వీరన్న.

పెళ్ళాడిన నాలుగైదేళ్ళవరకూ సోమమ్మకు సుఖంగానే గడిచింది. కాని వీరన్న త్రాగుడు అలవాటు చేసుకొని వచ్చే జీతంలో చాలవరకు

## ఆడ బ్రతుకు

త్రాగేసేవాడు. ఫ్యాక్టరీ మూయగానే సాయం కాలం ఇంటికి రాకుండా కల్లుపాకలో చాలా సమయం గడిపి రాత్రికి ఇల్లు చేరుతూ మొద లెట్టాడు వీరన్న. ఇంట్లో ఎవ్వరూ లేక బిక్కు బిక్కు మంటున్న వాతావరణంలో సతమత మవు తున్న సోమమ్మకు భర్త రాక ఏమాత్రం ఆనందం కలిగించలేకపొయ్యేది. మైలు దూరందాకా వ్యాపించే దుర్వాసనతో, భీకరమైన ముఖకవళి కలతో, మత్తుతో తూలుతూ ఇంట్లోకొచ్చిపడి సోమమ్మను బండబూతులు తిడుతూ, కొట్టేవాడు వీరన్న. ఇది క్రమేణ సోమమ్మక్కూడా తన నిత్యజీవితంలో ఒక ముఖ్య సంఘటనగా మారిపోయింది. ముందు ఊరక ఉన్నా, భర్తను తిట్టిపోస్తూ, బాధ భరించటం నేర్చుకున్నది ఆ ఇల్లాలు. భర్త అన్నం తిన్నాక, వడ్డి వంగేలా చాకిరి అంతా చేసుకొని ఒక మూలగా పడుకొనేది. అప్పుడప్పుడూ, మత్తువదిలిన సందర్భాల్లో, వీరన్న భార్యను లాలిస్తూ దగ్గరికి తీసేవాడు.

"సోమీ ! నువ్వెంత కలకల్లాడుతున్నావే ఇవేళ" అంటూ ఉపోద్ఘాతం ప్రారంభించేవాడు.

"పోండి ! మీ కళ్లకు ఇంతకుముందు ఎలా కనిపించానేం ? నా బ్రతుక్కు దెబ్బల రాత ఉండగా దీనిక్కూడా నోచుకున్నానా" అనేది కళ్లనీళ్ళు పెట్టుకుంటూ సోమమ్మ.

"అయ్యో ! నా మతి పాడుగాను. నిన్నెంత లేసికొట్టేశానే" అంటూ హూనమైపోయిన భార్య శరీరాన్ని నిమురుతూ అంతలోనే —

"సోమీ ! ఫ్యాక్టరీ పనుల్లో కరడుకట్టిన నా చేతి దెబ్బలకు మాంచి వస్తాదులే తట్టుకోరాయె. నువ్వెలా తట్టుకున్నావో ఆ రహస్యం కాస్త చెబుదూ" అనేవాడు వీరన్న.

సోమమ్మ ఫక్కున నవ్వేసేది — పాపం !

"ఇక మీ వీరత్వం నామీద చూపకండేం ? తాగనని ఒట్టు వెయ్యండి. అదే పది వేలు."

వీరన్న తాగుడు విషయం పక్కకు నెట్టి —

"అదుగో ! 'వీరత్వం' లోనే నా పేరు ఉంది. నా పేరు చెప్పేశావు సోమీ !" అనేవాడు.

సిగ్గుపడిపోయి, వీరన్న ఒడిలో ముఖం దాచు కునేది సోమమ్మ.

ఏండ్లు గడిచిపోయినయ్. వీరన్న దుక్కలా ఉన్నా, భర్తమీద బెంగతో, పిల్లలు లేరే అన్న నిరాశతో, ఇంటి ఖర్చులకోసం చాలీ చాలని డబ్బుతో కృంగిపో నారంభించింది సోమమ్మ. అయినా ఆమెకు తిట్లూ, దెబ్బలూ తప్పలేదు. వీరన్నకోసం బ్రతక తలుచుకుంది సోమమ్మ. కాని ఇంకా కొన్నేళ్ళు గడిచాక పరిస్థితులు తారు మారైనాయి. పెళ్లయిన పదేళ్లకు ఆ దంపతు లకు ఒక కొడుకు కలిగాడు. వీరన్న తన తండ్రి 'రామయ్య' పేర కొడుక్కు రామారావు అని పేరు పెట్టుకున్నాడు. సోమమ్మకు జీవితంలో ఒక మధురానుభూతి కలిగింది. తన కొడుకు తనకు అండగా ఉంటాడు. వాడి పోషణభారం నైతే

వేసుకొని తను జీవిత మాధుర్యం చవిచూడొచ్చు, అనుకుంది. రామారావు పెద్దవాడవుతున్న కొద్దీ సోమమ్మకు భర్తమీద ఒక అలక్ష్యం ఏర్పడ్డది. వీరన్న ఏమి చేసినా తను ఎరగనట్టు ఊరుకునేది. వీరన్నకు కొడుకుమీద ప్రేమవున్నా, తన వ్యసనాల మూలాన ఏమీ పట్టించుకునేవాడు కాదు.

జీతం ముగ్గురికీ సరిపోయేటంత వీరన్న సంపాదిస్తున్నా, దానికి తగ్గట్టు ఎక్కువ మోతాదులో తాగి, తందానాలాడుతూ ఉండేవాడు. కొడుక్కు స్కూలుఫీజు, పుస్తకాల విషయంలో ఎప్పుడూ సోమమ్మకూ, వీరన్నకూ మధ్య ఘర్షణ జరిగేది. అక్కసుకొద్దీ వీరన్న సోమమ్మను చితకబాదేవాడు. కొడుకు రామారావు చిన్నతనంనుంచీ తన తల్లి పడే బాధలు చూశాడు. తల్లిని వెంటేసుకొని తండ్రిపై ఎగిరేవాడు. వీరన్న ఆ కుర్రకుంకను కూడా నిర్దాక్షిణ్యంగా కొట్టేవాడు. రామారావుకు ఇందుమూలాన నాన్నంటే ఏవగింపుగా ఉండేది.

రామారావు పెద్దవాడైనాడు. మెట్రిక్కు వరకూ కష్టపడి చదువుకొని తండ్రి సిఫారసుమీద అదే ఫ్యాక్టరీలో గుమాస్తాగిరి సంపాదించాడు. సోమమ్మ వధువును ఏరి కోరి కొడుక్కి పెళ్లి చేయించింది.

వీరన్న ఫ్యాక్టరీ నుండి రిటైరయినాడు. సోమమ్మకు తెలీకుండా చేసిన అప్పులు చేతికి వచ్చిన ఫండులో చాల భాగం మింగేశాయి. ఇంతా అయినా వీరన్న త్రాగుడు మానలేదు. రామారావు చదువుకొన్నవాడు కాబట్టి అతడికి తండ్రి చేసే పనులు అసహ్యకరంగా అగుపించేవి. అయినా — వీరన్న అంటే ఇంటిల్లిపాదికీ హడలెత్తేది.

అలాంటి వీరన్న రెండేళ్ల క్రితం పక్షవాతంతో మంచాన పడ్డాడు. డాక్టరు సలహా ననుసరించి అతను తాగకుండా కట్టుదిట్టాలు చేశాడు కొడుకు రామారావు. వచ్చే వందా యాభై జీతంతో తల్లిదండ్రుల్నీ, భార్యా, ఇద్దరు పిల్లల్నీ పోషించుకుంటూ వస్తున్నాడు ఆ బుద్ధిమంతుడు. పక్షవాతంలోపడి మంచాన చేరినా వీరన్న మోయరాని బరువులా అయ్యాడు ఆ కుటుంబానికి. అన్నంలోకి మేక మాంసం లేనిదే వీరన్న ఆ పూట భోజనం చెయ్యడాయెను. రోజుకు మూడు నాలుగుమాట్లు కాఫీ, టీలు కావాలి. పళ్లు వగయిరా ఖర్చు, మందు ఖర్చులు ఉండనే ఉన్నాయ్. రాజభోగానికి అలవాటుపడ్డ వీరన్న శరీరపోషణకు అయ్యే ఖర్చులకు కొడుకు రామారావు సతమతమైనా, బండి ఎలాగో ఈడ్చుకొస్తున్నాడు. 'తనను సాధించే రోజులు మాసిపోయినా, తన కొడుకును కూడా సాధిస్తున్నాడీ ముసిలాడు' అని సోమమ్మ వాపోయేది. తను పెద్దరికం వహించే రోజులు కావని వీరన్నకు తెలుసునేమో — తనక్కావాల్సిన తిండి కోసం, సుఖంకోసం — ఎవరి బాధనూ లక్ష్యపెట్టకుండా — పసిపిల్లాడిలా మారాంచేస్తూ పొందగలుగుతున్నాడు !

వీరన్న అదృష్టానికి కోడలు మంచిదయింది. మామగారికి కావల్సిన వస్తువు అడక్కముందే తెచ్చిపెట్టి, సేవలు చేస్తుంది. సోమమ్మకు ఏ బాధ్యతా లేదు. అయినా — రామారావు —తన నోముల పంటమీద అవ్యాజానురాగం పుట్టుకొస్తుంది. తన కొడుకే లేకపోయినట్లయితే — ఈ కోడలు ఉండేదా ? తన భర్తకు సదుపాయాలు జరిగేవా ? — లేక తనే ఉరి పోసుకొని చచ్చిపోయి ఉండేదేమో !—ఆడదాని బ్రతుక్కు విలువ ఇంతే గదా అనిపిస్తుంది సోమమ్మకు. ★



గృహాలంకరణ

చిత్రం—వి. పూర్ణానంద శర్మ (వెల్లటూరు)

## గమనిక

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 1961 ఆగస్టు 2 వ తేది సంచిక 30 వ పేజిలో ప్రచురితమైన త్రివర్ణ చిత్రం 'తాజమహల్'; ఫోటో పంపిన వారు శ్రీ వి. టి. గోపాల్ (మద్రాసు) అని గమనించ కోరుతున్నాము.

—ఎడిటర్